# ఆటాడుకుందాం రా!

– శ్రీకంఠస్ఫూర్తి

**‘వంశీ’ కిటికీ ముందు కుర్చీలో కూర్చున్నాడు! వంశీ చేతిలో పుస్తకం వుంది. అతని ముందు టేబిలు మీద పుస్తకాలు దొంతరలుగా పడివున్నాయి. వంశీ పుస్తకంలోని పేజీలు తిప్పుతున్నాడు. గొంతు విప్పి పైకి వినబడేలా గట్టిగా చదువుతున్నాడు.**

పదే పదే చదివినా వంశీకి పాఠం తలకెక్కడం లేదు. నోటికి పట్టడం లేదు.

వంశీ గది గుమ్మం వైపు చూశాడు. ఆ గది తలుపులు దగ్గరగా మూసి వున్నాయి. గది మధ్య సీలింగు ఫేను గిర్రుమని తిరుగుతూ బర్రు బర్రుమంటూ శబ్దం చేస్తోంది.

తన గొంతును, చదివే తీరును ఇంట్లోంచి మమ్మీ, డాడీ గమనిస్తున్నారని వంశీకి తెలుసు. వంశీ బిగ్గరగా చదువుతన్నాడు. చదువుతూ, చదువుతూ వంశీ కిటికీలోంచి బయటకు చూశాడు.

కిటికీకి వంద గజాల దూరంలో సందు మొదట్లో చందూ నిలబడి వున్నాడు. వంశీని రా! రమ్మని చేయి ఊపుతున్నాడు. ఏవో సైగలు చేస్తున్నాడు. గొంతు తగ్గించి, పెదాలు కదుపుతూ మాట్లాడుతున్నాడు. చందూ మాటలు వంశీకి స్పష్టంగా వినబడకపోయినా వాడు తనని ఆడుకోవడానికి రమ్మంటున్నాడని అర్థం అయింది.

వంశీకి వెళ్ళి చందూతో ఆడుకోవాలనుంది.

సాయంత్రం అయిదు గంటలు.

వంశీ ఇంటికి రెండు వీధులకవతల పెద్ద ఆటల మైదానం వుంది. ఈ సమయంలో ఆటల మైదానం కళకళలాడిపోతుంది. బోలెడు మంది చిన్నా పెద్ద పిల్లలు. సముద్ర కెరటాల్లా తుళ్ళిపడుతుంటారు.

కేకలు పెడుతూంటారు. కేరింతలు కొడుతుంటారు. రకరకాల ఆటలు. ఉత్సాహంతో ఆడుకుంటూ వుంటారు.

వంశీకి చందూతో కలిసి ఆ మైదానంలో ఆడుకోవడం ఇష్టం.

చందూకి వంశీ ఆటల్లో తన వెంట వుంటేనే ఆనందం.

ఇద్దరి చదువూ ఒకే స్కూల్లో, ఒకే క్లాసులో, ఒకే బెంచీలో. ఇద్దరి ఇళ్ళూ ఒకే వీధిలో. ఇద్దరి మనసులూ, ఒకే స్నేహ వారధిలో.

వంశీ పాఠం వల్లె వేస్తున్నాడు. కిటికీలోంచి చందూ వైపు దిగులుగా చూస్తున్నాడు.

ప్రొద్దుట లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ పుస్తకాలే, పాఠాలే. పుస్తకాలు పట్టుకునే వుండాలి. పాఠాలు చదువుతూనే వుండాలి. ప్రొద్దుట ప్రైవేటు టీచరమ్మ దగ్గర పాఠాలు, సాయంత్రం ప్రైవేటు మాస్టారి వద్ద పాఠాలు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంకాలం నాలుగున్నర వరకూ స్కూల్లో టీచర్ల ముందు పాఠాలు.

వంశీకి చికాకుగా వుంది, కోపంగా వుంది, విసుగ్గా వుంది. ఆ గదిలోంచి బయటపడి హాయిగా చందూతో మైదానంలో ఆడుకోవాలనుంది.

“మమ్మీ! కాస్సేపు ఆడుకుంటాను” అంటే మమ్మీ పెద్ద నోరు పెట్టుకుని అరుస్తుంది, తిడుతుంది. డాడీ ఉరిమి, ఉరిమి చూస్తూ బెత్తం ఝుళిపిస్తాడు.

వంశీకి అసహనంగా వుంది. పాఠం చదవడం అయిష్టంగా వుంది.

సందు మొదట్లో చందూ ఇంకా నిలబడే వున్నాడు. ఆటకురా! రమ్మని పిలుస్తూనే వున్నాడు. తను రానని, రాలేనని చేత్తో సైగలు చేసినా వాడు కదలడం లేదు.

గది తలుపులు ధన్మని తెరుచుకున్నాయి. కామేశ్వరి హార్లిక్స్ కలిపి తీసుకొచ్చింది. గ్లాసును కొడుకు చేతికిచ్చింది.

“-రేయ్! వంశీ! ఈ హార్లిక్స్ తాగేసి ముఖం కడుక్కుని ట్యూషన్‌కి వెళ్ళిపో! సెవెన్త్ పరీక్షలంటే ఆషామాషీ కాదు. చాలా కష్టపడి చదివాలి. పరీక్షలింక మూడు నెలలే వున్నాయి. పుస్తకాల మీద తప్ప దృష్టి దేనిమీదా పెట్టుకోకూడదు తెలిసిందా?”

కామేశ్వరి హూంకరించింది. వంశీ తల ఊపాడు. హార్లిక్స్ నోటి దగ్గర పెట్టుకుని త్రాగుతున్నాడు.

వంశీ తెలివైనవాడే. కష్టపడి చదువుతాడు. అన్నిట్లోనూ ఫస్టు మార్కులే వస్తాయి. అవి సరిపోవు. కనీసం జిల్లాకు ఫస్టు రావాలి. రాష్ట్రంలో రేంకు సాధించాలి. అవి సాధించేలా తను తయారు చేయాలి.

కొడుకును దీక్షగా చూసుకుంటోన్న కామేశ్వరి కళ్ళు కిటికీలోంచి సందు మొదట్లో నిలబడ్డ చందూ మీద పడ్డాయి.

“ఏవండోయ్” భర్తను కేక పెట్టి పిలిచింది. రామ్మూర్తి గదిలోకి వచ్చాడు.

“చూశారా? ఆ సందు మొదట్లో ‘చందూ'గాడ్ని? ఎలా సైగలు చేసి పిలుస్తున్నాడో. కూసేగాడిదొచ్చి మేసే గాడిదని చెడ గొట్టిందనీ వాడి వల్లే వీడు చెడిపోతున్నాడు. వీడి దృష్టి ఆటల మీదకు పోతోంది. ఎన్నిసార్లు చెప్పినా వాడు రావడం మానడం లేదు.

కామేశ్వరి మాటలు పూర్తి కాలేదు. రామ్మూర్తి లుంగీ సర్దుకుని బెత్తం తీసుకుని బయటకు దూకాడు.

రామ్మూర్తిని చూసి చందూ పరుగు లంకించుకున్నాడు. రామ్మూర్తి వదిలి పెట్టలేదు. సందు చివరి వరకూ తరిమి తరిమి చందూ జుట్టు పట్టుకున్నాడు. ఛెళ్, ఛెళ్‌మంటూ బెత్తంతో నాలుగు దెబ్బలు కొట్టి కసి తీర్చుకున్నాడు. దెబ్బలు తిన్న చందూ దబ్‌మని కిందపడిపోయాడు. ‘అమ్మోయ్! బాబోయ్' అంటూ ఘొల్లుమని ఏడుస్తూ దేకుతూ, దెక్కుతూ తప్పించుకుని పారిపోయాడు.

తన కోసం... తన నేస్తం.. దారుణంగా దెబ్బలు తిన్న దయనీయ దృశ్యాన్ని వంశీ కిటికీలోంచి కళ్ళారా చూశాడు. వంశీ కళ్ళల్లో నీళ్ళు చిప్పి

ల్లాయి.

ఏడుపు ముంచుకొచ్చింది.

పీడ విరగడయిందంటూ కామేశ్వరి మెటికలు విరిచింది. ఆయాసపడుతూ బోర విరుచుకుంటూ విరిగిన బెత్తంతో తిరిగి వచ్చాడు రామ్మూర్తి.

"వెధవ మీకు తెలుసా వాడికి అబ్బ లేదు. అమ్మొకత్తె వుంది. ఎర్రగా, బుర్రగా ఇంత కొప్పెట్టుకుని పూటకో చీర మారుస్తుంది. టూరిస్టు లాడ్జి దగ్గర కూర్చుని ప్లాస్టిక్ పెట్టెల్లో పాల పేకెట్లు అమ్ముతుంది. చూడ లేదూ? ఎన్ని వేషాలేస్తుందో? లేకపోతే మనతో బాటు సమానంగా ఫీజులు కట్టి కొడుకుని ఆ స్కూల్లో చదివించ గలుగుతుంది.

కామేశ్వరి సాగ దీసుకుంటూ లోపలికి వెళ్ళింది. అమ్మ మాటలు వింటూ ప్రైవేటు మాస్టారు ఇంటికి బయలుదే రాడు వంశీ.

వంశీకి మళ్ళీ దుఃఖం వచ్చింది.

తన కోసం అన్యాయంగా దెబ్బలు తిన్న చందూయే వంశీ కళ్ళల్లో మెదులుతున్నాడు.

** ** **

వంశీ రోజూ సాయంత్రం కిటికీ వద్ద కూర్చుంటున్నాడు.

పట్టుదలగా పాఠాలు బట్టీ పడుతున్నాడు.

సందు మొదట్లో చందూ మాత్రం కనిపించడం లేదు.

వంశీని రా రమ్మని ఆటలకు పిలవడం లేదు.

వంశీ చందూ గురించే ఆలోచిస్తున్నాడు.

డాడీ చందూని కొట్టిన తరువాత వాడు మూడు రోజుల వరకూ స్కూలుకే రాలేదు. నాలుగో రోజు నీరసంగా నడిచి వచ్చాడు. ముఖంలో జీవకళే లేదు. మూడు రోజులుగా జ్వరమట. మీ డాడీకొట్టిన దెబ్బలకే జ్వరం వచ్చింది అన్నాడు. అయినా మీ డాడీకొట్టినట్టు మా అమ్మతో చెప్పలేదు అన్నాడు. అమ్మతో చెబితే తనని పట్టుకుని రోజంతా ఏడుస్తుంది. అన్నం తినడం మానేస్తుందీ అంటూ తనే ఏడ్చేవాడు.

వంశీకి ఏడుపొచ్చింది. మనసు బరువుగా, బాధగా అనిపించింది.



"సారీ! రా!" అంటూ వంశీ చందూ చేయి పట్టుకున్నాడు. చందూ కొంత సేపు మౌనంగా వుండిపోయాడు ఆ తర్వాత "ఆటలాడుకోవడం తప్పు కాదు కదరా! పరీక్షలయిపోయిన తరువాత మనిద్దరం హాయిగా ఆ మైదానంలో ఆడుకుందాం! లే" అంటూ చందూ వంశీకి మాట ఇచ్చాడు.

ఇద్దరూ చేయి చేయీ కలుపుకుని క్లాసులోకి వెళ్ళిపోయారు.

డాడీ కొట్టినా చందూకి తన మీద కోపం రానందుకు వంశీ సంతోషించాడు.

మూడు నెలలు గడిచాయి. ఏడవ తరగతి పరీక్షలు హడావుడిగా ప్రారంభమయ్యాయి.

కామేశ్వరి, రామ్మూర్తి వంశీని బయటకు వెళ్ళకుండా చూశారు. దృష్టి ఆటల మీదకు పోకుండా జాగ్రత్త పడ్డారు. రాత్రింబవళ్ళు కాపలా వుండి శ్రద్ధగా చదివించారు. వంశీ పట్టుదలగా పరీక్షలు రాశాడు. పరీక్షలవగానే వంశీని వాళ్ళమ్మగారింటికి విజయవాడ పంపించింది కామేశ్వరి. వంశీకి బెంగగా అనిపించింది. చందూని కలుసుకోవడం కుదరలేదు. వాడితో తనివితీరా ఆటల మైదానంలో ఆడుకోవడం పడలేదు.

నెలా పదిహేను రోజుల్లోనే పరీక్షా ఫలితాలు వచ్చాయి. వంశీ ఊరు నుంచి వచ్చాడు. కొడుకుని చూసి కామేశ్వరి నెత్తీ నోరూ కొట్టుకుంది. పెద్ద గొంతుతో ఏడవడం మొదలు పెట్టింది.

వంశీ సైన్సు, హిందీ, లెక్కల పరీక్షల్లో తప్పాడు. కనీస మార్కులు రాలేదు. కానీ చందూ ఏడవ తరగతి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. రామ్మూర్తి కోపంతో బెత్తం తీసుకున్నాడు. వంశీని బరబరా గదిలోకి ఈడ్చుకుపోయాడు. కామేశ్వరి ఏడుస్తూ భర్తను అడ్డుకుంది.

ఎదురుగా కిటికీ లోంచి చూస్తే సందు మొదట్లో వంశీ కోసం చందూ నిలబడి వున్నాడు. కళ్ళు చికిలించి తొంగి తొంగి తమ ఇంటివైపే చూస్తున్నాడు. వాడి కళ్ళల్లో , మనసులో ఏ ఏ భావాలు కదులుతున్నాయో.

కామేశ్వరి చందూని ఆశ్చర్యంగా చూసింది. కొడుకు పరీక్ష తప్పడం ఆమెకు పిచ్చి పట్టినట్లుగా వుంది. అదామెకు ఆశల అశనిపాతం. ఎంతో శ్రద్ధగా చదివించినా ఎందుకిలా జరిగింది? ఫస్టు రేంకులో వస్తాడనుకున్న కొడుకు పరీక్ష తప్పడం ఏమిటి? క్షణకాలం ఆమె మస్తిష్కంలో చిన్న మెరుపు, ఆలోచన.

కామేశ్వరి ఏమనుకుందో భర్త చేతి లోంచి బెత్తాన్ని లాక్కుంది. దాన్ని రెండు ముక్కలుగా విరిచి మూలపడేసింది.

"ఒరేయ్! వంశీ! నువ్వెళ్ళి చందూతో ఆడుకో! ఫో!" తల్లి ఆజ్ఞతో వంశీ లేగదూడలా ఒక్క గెంతు బయటకుగెంతాడు. సందు మొదట్లో నిలబడ్డ చందూని కలుసుకున్నాడు. వాడి భుజం మీద చేయి వేశాడు. ఇద్దరూ ఉప్పొంగే హృదయాలతో ఆటల మైదానంలోకి పరుగెత్తారు. మైదానం పిల్లలతో సందడిగా వుంది. వంశీ జేబులోంచి బంతిని తీశాడు.

"వంశీ! నీ పరీక్ష పోయినందుకు నాకు బాధగా వుందిరా!" చందూ తన బాధని వ్యక్తం చేశాడు.

"నాకేం బాధలేదురా! పరీక్షలు నేను కావాలనే బాగా రాయలేదు. మమ్మీ! డాడీ! నన్ను గదిలో పెట్టి బలవంతంగా చదివించారుగా! డాడీ నిన్ను అన్యాయంగా కొట్టరుగా! నన్నూ నిన్నూ ఆడుకోనివ్వలేదుగా. అందుకనీ. పద, ఆటాడుకుందాం!"

వంశీ గాల్లోకి స్వేచ్ఛగా బంతి విసిరాడు. దాన్ని అందుకోవటానికి చందూ ఆనందంగా పరుగు పెట్టాడు. ●

**న్యూజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక సంయుక్తంగా నిర్వహించిన '97 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

# ఆమె ఏం చెబుతోంది



ఇది మరేదో కాదు ఒట్టి ప్రేమ, మోహం మాత్రమే. దీన్ని ఈ నిర్దయ ప్రపంచం గుర్తించలేదు కానీ ఓ వెర్రి ప్రేమికుడు మాత్రమే గుర్తించగలడు అని అర్థం వచ్చేలా హిందీలో ఓ పాటుంది. పొరపాటున ఈ పాటలో చెప్పినట్లు కాకుండా మీకు మీరు ఇష్టపడుతున్న అమ్మాయో లేక ప్రేయసి యొక్క బాడీ లాంగ్వేజీ మీకు అర్థం కావడం లేదనుకోండి ఈ కింద పేర్కొన్న చిన్న చిట్కాలను గుర్తుంచుకోండి. ఆమె మనసులో ఏం అనుకుంటుందో తెలిసే అవకాశం మాత్రమే వుంది సుమండీ.

ఆమె కళ్ళు

మిమ్మల్ని చూడగానే ఆమె విశాలమైన కళ్ళు మరింత పెద్దవయ్యావనుకోండి. ఆమె మీరంటే ఇష్టపడుతోందని అర్థం. మనం ఏదైన ఇష్టమై వస్తువును చూసినపుడు కళ్ల వాటంతట అవే పెద్దవి అవుతాయని సైన్సుకూడా చెబుతోంది.

ముడుచుకున్న శరీరం.- ఆమె మీతో వున్నపుడు చేతులు కట్టుకునో, బిగదీసుకునో కూర్చుందనుకోండి. ఆమె మనసులో ఎక్కడో మీతో అనీజీగా ఫీలవుతోందని గమనించండి ఆమెకు ఏవిషయంలో అనీజీనెస్ తో వుందని గమనించుకోండి. లేదా అటువంటి సమయంలో ఆమె చిన్నగా గుడ్ బై చెప్పి బయటపడిపోవడం మంచిది.

ముడివేసుకున్న కాళ్ళు- కాళ్ల మీముందుకు బారజాపి నిర్లక్ష్యంగా కూర్చుంటే ఆమె మీ నుంచి విడిపోవాలని కోరుకుంటుందనమాటే.

పాదాలు- కళ్ళు ఎలా భావాలను పలికించగలవో, అలానే పాదాలు కూడా భావాలను పలికించగలవు. పాదాలను ఒద్దికగా పెట్టుకుంటే మీరంటే ఇష్టపడుతున్నట్టే లెక్క. కాలు మూపుతుంటే పరమబోరు ఫీలవుతోందని గమనించండి.

జుత్తు- ఆమె మీముందే సడన్‌గా దువ్వెన తీసి కురులు సవరించుకుందనుకోండి అది మీకోసమే. తల గోక్కుంటుంటే మాత్రం మీరు ఆలోచించుకోవలసిన విషయమే.

తల- ఒకవైపుగా పెట్టి, ఆమె ముఖం ప్రసన్నంగా వుంటే మీ పంట పండినట్టే నండోయ్. ●